నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మడిదల/బొల్లారం, డిసెంబర్ 18: గుమ్మడిదల సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ దుర్గాప్రసాద్, జిన్నారం, బొంతపల్లి ఏఈలు వెంకటేశ్వర్లు, రవీందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ, గుమ్మడిదల, బొంతపల్లి, కానుకుంట, నల్లవల్లి, ప్రకృతినివాస్, జిన్నారం, గడ్డపోతారం, సోలకపల్లి, శివానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సహకరించాలని కోరారు.

పోలీస్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

పుల్కల్, డిసెంబర్ 18: పోలీస్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు పంపిన ఘటన బుధవారం మండల కేంద్రమైన పుల్కల్‌లో చోటుచేసుకుంది. ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ గ్రామానికి చెందిన పెద లోడి సంగమేశ్ ఈ నెల 16వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో బస్టాండ్ సమీపంలో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడని 100 నంబర్‌కు కాల్ రావడంతో బ్లూ కోర్టు సిబ్బంది అక్కడికి వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణకు సమాచారం అందించడంతో అతను అక్కడికి వెళ్లి చెప్పినా వినలేదు. పోలీసులైతే నాకేంటి అంటూ దుర్భాషలాడుతూ పిడికిలి బిగించి వేళ్ల మధ్యలో తాళం చెవి పెట్టుకొని హరికృష్ణపై దాడి చేసి గాయపరచాడు. విధినిర్వహణలో ఉన్న పోలీసుపై దాడి చేసినందుకు సంగమేశ్‌పై కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

కవేలిలో షార్ట్ సర్క్యూట్

కోహీర్, డిసెంబర్ 18: మండలంలోని కవేలి గ్రామంలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన మైనోద్దీన్ ఇంట్లో మంటలు చెలరేగాయి. నీటిని వేడి చేసేందుకు వినియోగించిన విద్యుత్ పరికరం ద్వారా షార్ట్ సర్క్యూట్ వ్యాపించింది. దీంతో విద్యుత్ తీగలతో పాటు, సోఫాసెట్, తదితర సామగ్రి బూడిదయ్యింది. మిద్దె ఇంటి పైకప్పుకు కూడా మంటలు వ్యాపించడంతో జహీరాబాద్ అగ్ని మాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

పటాన్‌చెరు, డిసెంబర్ 18: పాశమైలారం పారిశ్రామికవాడలోని ఫ్యూజో పరిశ్రమలో సోలార్ సిస్టమ్‌లో మరమ్మతులు చేసేందుకు వచ్చిన వ్యక్తి షెడ్ పైనుంచి పడి మృతి చెందాడు. బీడీఎల్ భానూర్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన కథనం ప్రకారాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన చక్రంపల్లి యోగేశ్వర్‌రెడ్డి కేఎన్నార్ సోలీర్ సిస్టం సంస్థలో పనిచేస్తున్నాడు. బుధవారం పాశమైలారంలోని ఫ్యూజో పరిశ్రమ షెడ్‌పై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌కు మరమ్మతు పనులు చేసేందుకు వచ్చాడు. షెడ్ పైకి ఎక్కి పని చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి., వెంటనే యోగేశ్వర్‌రెడ్డిని పరిశ్రమ సిబ్బంది ప్రైవేటు దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. యోగేశ్వర్‌రెడ్డి భార్య చక్రంపల్లి శ్రావణి ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతేహాన్ని పటాన్‌చెరు ఏరియా దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భద్రత లోపంతోనే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, బీడీఎల్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 18: ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పాలిటెక్నిక్ డైరెక్ట్ ప్రవేశాల కోసం నేటి నుంచి జనవరి 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ రెండేళ్లు చేసిన వారు, ఐటీఐలో 60 శాతంతో ఉత్తీర్ణులైన వారు అర్హులని స్పష్టం చేశారు. వయస్సుకు పరిమితి లేదని, రాష్ట్రంలో బ్రిడ్జి కోర్సు కేంద్రాలు మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, కొత్తగూడెం, మల్లేపల్లి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, అల్వాల్, సంగారెడ్డిలో ఉన్నాయని వివరించారు.

'పది'లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాయికోడ్, డిసెంబర్ 18: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి మండలాన్ని జిల్లా, రాష్ట్రస్థాయిలో ముందుంచాలని ఎంఈవో అంజయ్య అన్నారు. బుధవారం రాయికోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురు యువకుల చేరిక

నాగల్‌గిద్ద, డిసెంబర్ 18: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో వచ్చి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని మావినెల్లి గ్రామానికి చెందిన 20 మంది యువకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన కొనసాగిస్తున్నదని, రైతులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ద్వజమేత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చేరినవారిలో దత్తుసాగర్, శివకుమార్, సంగమేశ్, చెన్నప్ప, శ్రీకాంత్, సుధాకర్, మాలి పటేల్, నాగిశెట్టి, గణేశ్‌పాటిల్, అంగత్రావ్ తదితరులు ఉన్నారు.



యువకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు

కంది, డిసెంబర్ 18: జైల్లో శిక్ష అనుభవిస్తూ కేసులు పరిష్కరించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. న్యాయ సేవలు పొందాలనుకునే ఖైదీలు తమ వివరాలు అందజేయాలని సూచించారు. బుధవారం కందిలోని సెంట్రల్ జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. బేరక్‌లు, గదులు, వంట గది, టాయిలెట్లను పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి సమస్యలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్స్,ములాఖత్‌లపై ఆరా తీశారు. ఖైదీలకు వడ్డించే భోజనాన్ని రుచి చూశారు. స్టోర్ రూంలోని కూరగాయలు, నిత్యావసర సరుకులు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించి జైలు అధికారులకు పలు సూచనలు, చేశారు. తనిఖీలో జైలు అధికారులతోపాటు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైలులో భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సైన్స్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలతో డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 18: తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సైన్స్ కేంద్రంలో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని 28 మండలాల నుంచి 92 మంది విద్యార్థులు టెస్టులో పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఈ పరీక్ష నిర్వహించారు. తెలుగు మాధ్యమంలో గుమ్మడిదల మండలం అనంతారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జశ్వంత్ మొదటి స్థానంలో నిలవగా, రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయికుమార్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఆంగ్ల మాధ్యమంలో న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాదియా నౌషిన్ మొదటి స్థానం, మునిపల్లి మండలం లింగంపల్లి టీజీఆర్ఎస్ విద్యార్థి జి.వినయ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ లింబాజీ, ఎంఈవో విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి సిధారెడ్డి పాల్గొన్నారు.

కోహీర్‌లో దర్గా ఉర్సు ప్రారంభం

కోహీర్, డిసెంబర్ 18: కోహీర్ పట్టణంలోని సయ్యద్ హజ్రత్ మౌలానా మోహిజోద్దీన్ తుర్కి 766వ ఉర్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేశారు. ఉర్స్‌లో భాగంగా ఉదయం సర్కారీ గంధంతో ఊరేగింపు నిర్వహించి దర్గాకు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్సై సతీశ్, మాజీ ఎంపీపీ, దర్గా కమిటీ అధ్యక్షుడు శౌకత్‌అలీ, ఉపాధ్యక్షుడు ఎజాజ్ బండారీ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జూనియర్ కళాశాల తనిఖీ

అందోల్, డిసెంబర్ 18: జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్మీడియట్ జిల్లా అధికారి గోవిందరామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల షెడ్యూల్ విడుదలైనందున విద్యార్థులు కష్టపడి చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమయంలో తల్లితండ్రులు సైతం పిల్లలకు అండగా ఉండాలని, వారికి మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం కళాశాలలో రికార్డులను పరిశీలించి పరీక్షలు నిర్వహించే కేంద్రాలను సందర్శించారు. సిబ్బంది శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, మల్లేశం, ప్రసన్న పాల్గొన్నారు.

జోగిపేట జూనియర్ కళాశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారి

జిల్లా స్థాయిలో అనంతారం విద్యార్థి ప్రతిభ

గుమ్మడిదల, డిసెంబర్ 18: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనంతారం గ్రామానికి చెందిన విద్యార్థి కొమ్ము జస్వంత్ జిల్లా స్థాయిలో నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు చేతులమీదుగా ప్రశంసాపత్రంతో పాటు బహుమతి అందుకున్నాడని ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని బోధకులు హరీశ్‌కుమార్, శ్రీనివాసరావు, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

విద్యార్థి కొమ్ము జస్వంత్‌కి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం, డిసెంబర్ 18: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు వైఎస్సార్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సతీశ్, ఏఈ కిష్టయ్య, సిబ్బంది ప్రశాంత్ పాల్గొన్నారు.

యూజీడీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

సర్వీస్ చేస్తూ ఇండోర్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 18: వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా బుధవారం మూడో రోజు కలెక్టరేట్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్య సాధనకు ముందుకు సాగాలన్నారు. జిల్లా పేరును జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిలపాలని ఆకాంక్షించారు. డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈతల పోటీలను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, డీవైఎస్‌వో ఖాసీం బేగ్ ప్రారంభించారు. అంబేద్కర్ మైదానంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ప్రారంభించారు. అనంతరం ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమూల్యమ్మ, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

మునిపల్లి, డిసెంబర్ 18: మునిపల్లి ఆదర్శ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలు, సౌకర్యాలపై ఆరాతీశారు.

భారతీనగర్‌లో కార్పొరేటర్ 'బస్తీదర్శన్'

ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, డిసెంబర్ 18: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ, న్యూ ఎంఐజీ, హెచ్ఐజీ కాలనీల్లో బస్తీ దర్శన్ నిర్వహించారు. ఆయా కాలనీల్లో సమస్యలను నేరుగా కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు కార్పొరేటర్ దృష్టికి వచ్చాయి. దీనికి స్పందించిన ఆమె జలమండలి అధికారులతో మాట్లాడి ఎంఐజీ కాలనీలో పలు చోట్ల డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయించడంతోపాటు అవసరమైతే నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను వెంటనే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ సుబ్రహ్మణ్యం, బల్దియా ఏఈలు రమేశ్, దివ్యతేజ, కాలనీవాసులు సుబ్బారావు, నారాయణగౌడ్, నీలకంఠ, తిలావత్, సంపత్, హెచ్ఐజీ వాసులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీడీఎస్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు

జహీరాబాద్, డిసెంబర్ 18: జహీరాబాద్ పట్టణంలోని సిద్ధార్థ, జిల్లా పరిషత్ ఉన్నత బాలిక, బాలుర పాఠశాలు, శాంతినగర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పస్తాపూర్ డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు జీవ వైవిధ్యంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పాత పంటలు, అంతరించిపోతున్న ప్రకృతి సంపద, వనరులు, పండుగల గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు డీడీఎస్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ నిర్వాహకులు, సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ

జహీరాబాద్, డిసెంబర్ 18: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తుందని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని లచ్చునాయక్ తండాకు చెందిన కావేరి, సత్వార్‌కు చెందిన రహీంబీలకు మంజూరైన రూ.71 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకులు హీరురాథోడ్, అమీత్‌కుమార్, సహీద్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సన్మానం

కొత్తగా వచ్చిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

హత్నూర, డిసెంబర్ 18: హత్నూర పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల నూతనంగా నియామకమై వచ్చిన పోలీసు సిబ్బందిని హత్నూర మండలం సిరిపుర మాజీ సర్పంచ్ మచ్చనరేందర్ ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది సేవలు ఎనలేనివన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, నగేశ్‌గౌడ్, మధు, మానయ్య, మహిపాల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

చక్రియాల్‌లో ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి

చౌటకూర్, డిసెంబర్ 18: మండలంలోని చక్రియాలలో పురాతన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి పునశ్చరణ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం బ్రహ్మశ్రీ విద్యాపీఠం డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మహారాజుల రామకృష్ణ శర్మ వైదిక నిర్వహణలో మూడు రోజులుగా జరుగుతున్న మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ముగింపు రోజున వేద పండితులు గర్ష, భీజ, రత్న, రత్న, దాతు న్యాసములు యంత్రమూర్తి, ధ్వజ ప్రాణ ప్రతిష్ఠతోపాటు జీవ కళాన్యాసములు పూర్ణాహుతి మహాభిషేకం, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. మహోత్సవాల్లో కీలకమైన ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం కనుల పండుగలా సాగింది. ప్రత్యేకంగా తయారు చేయించిన 42 అడుగుల ధ్వజ స్తంభాన్ని వాహనంలో ఆలయం వద్దకు చేర్చారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వరశర్మ సిద్ధాంతి వైదిక నిర్వహణలో సాగిన ఈ ఆపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు భక్త జనం తరలివచ్చింది. ధ్వజ స్తంభాన్ని భారీ క్రేన్ల సహాయంతో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. బలిప్రదానం అనంతరం ఆలయ సంప్రోక్షణ చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

దర్శించుకున్న మాజీ ప్రజా ప్రతినిధులు

శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి సదర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. యాగశాలలో మహేశ్వర శర్మ సిద్ధాంతి ఇద్దరినీ ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు గాజుల వీరేందర్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివకుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు అనంతయ్య, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య, నాయకులు ఎర్రోల్ల పోచయ్య, మల్లేశం, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు కమిషన్ కృషి

భెల్‌లో మొక్కను నాటిన జాతీయ కమిషన్ సభ్యుడు వెంకటేశన్, ఈడీ కేబీ రాజా

రామచంద్రాపురం, డిసెంబర్ 18: భెల్ పరిశ్రమను సఫాయి కార్మికుల జాతీయ కమిషన్ సభ్యుడు ఎం.వెంకటేశన్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ ముఖద్వారంలో ఆయనకు భెల్ ఈడీ కేబీ రాజా స్వాగతం పలికారు. అనంతరం సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆయనకు గౌరవవందనం చేశారు. ఆ తర్వాత భెల్ పరిశ్రమ అడ్మిన్ భవనం ఆవరణంలో ఈడీతో కలిసి ఆయన మొక్క నాటారు. ఆ తర్వాత పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులను కలిసి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్లు సకాలంలో వేతనాలు ఇస్తున్నారా అని అడిగారు. కార్మికులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, పరిశ్రమలో కార్మికులను బెదిరించడం, పని ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు ఏమైనా ఉన్నాయ అని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సు కోసమే సఫాయి కార్మికుల జాతీయ కమిషన్ ఉన్నదని, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కార్మికులు జీతాలు పెరిగేలా చూడాలని కమిషన్ సభ్యుడు వెంకటేశన్‌ను కోరారు. కార్యక్రమంలో జీఎంలు, ఏజీఎంలు ఉన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

సిద్ధివినాయక ఆయలంలో భక్తుల పూజలు

జహీరాబాద్, డిసెంబర్ 18: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయం భక్తులతో సందడిగా మారింది. బుధవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆలయంలో వేదపండితులు స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, గణేశ హోమం, హారతి తదితర పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాగశాలలో సిద్ధి, బుద్ధి సామేత వినాయకుడి కల్యాణోత్సవాన్ని కనుల పండువుగా నిర్వహించారు. మండలంలోని హడ్నూర్ వరసిద్ధి వినాయక, చీకూర్తి గ్రామంలోని సిద్ధివినాయక ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రేజింతల్ సిద్ధివినాయక స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

విరాళం అందజేస్తున్న ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు, గాజుల వీరేందర్

చౌటకూర్, డిసెంబర్ 18: మండలంలోని చక్రియాల గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు గాజుల వీరేందర్ ఆయన సోదరుడు గాజుల చెన్నయ్యతో కలిసి విరాళం అందజేశారు. వీరేందర్ తండ్రి గాజుల అనంతరాములు జ్ఞాపకార్థం రూ.1,01,111 విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్యకు బుధవారం అందజేశారు. ముమ్ముందు ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి,